క్లుప్తంగా

జవానుకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆడే శ్రీనివాస్ –శిలాబాయి దంపతుల కుమారుడు ఆడే గణేశ్ బీఎస్ఎఫ్ ట్రినింగ్ పూర్తి చేసుకొని ఇంటికి వచ్చిన సందర్భంలో గ్రామస్తులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. కొత్తపల్లి, పిక్లాతండా గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో బీఎస్ఎఫ్ జవాను ఆడే గణేశ్‌కు స్వాగతం పలికారు. వైస్ ఎంపీపీ ఆత్మరాం, మాజీ సర్పంచ్ కిషన్, ఉదయ్, విద్యార్థి నాయకుడు ఆడే సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



5కే రన్ నిర్వహిస్తున్న అధికారులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో అధికారులు 5కే రన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటన్నారు. కార్యక్రమంలో సభ్యులు క్రాంతి, మోతీరాం, సుభాష్, ఓదేలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యులు అన్ని పార్టీల్లో ఉన్నారు'

ఆసిఫాబాద్: ఆర్యవైశ్యులు బీజేపీకి చెందిన వారుగా కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో ఖండించారు. ఆర్యవైశ్య సంఘం ఇంటర్నేషనల్ అధ్యక్షుడు చిలువేరు వెంకన్న, కార్యదర్శి గుండ ప్రమోద్, నాయకులు గంధం శ్రీనివాస్, గుండ వెంకన్న, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. ఆర్య వైశ్యులు ధనవంతులు బీజేపీకి ఓటు వేస్తారని ముద్ర వేయడం మానుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్యులు కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు బీజేపీలో కూడా ఉన్నారన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్‌లు కాంగ్రెస్‌లో లేరా అని ప్రశ్నించారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఆర్డీవో సురేశ్‌కు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ నాయకులు ఓటర్ స్లీప్పులపై నరేంద్రమోదీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ ఫోటోలతో ప్రింట్ తీసిన పత్రాలను కాగజ్‌నగర్ పట్టణంలో పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్, రాంబాబు, రామయ్య, అతర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



సాయం అందజేస్తున్న ఎస్సై నరేశ్

చింతలమానెపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన గుర్లె మల్లేష్ కుటుంబానికి దాతలు అండగా నిలిచారు. ఈమేరకు దాతలు అందించిన సహాయాన్ని ఎస్సై నరేశ్ శుక్రవారం మృతుని కుటుంబానికి అందించారు. డబ్బా గ్రామ పంచాయతీ ధరంపెల్లి గ్రామానికి చెందిన గుర్లె మల్లేష్ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక యువకులు శ్రీశివరామ సాయి యూత్ ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రచారం నిర్వహించారు. దాతలు అందించిన రూ.15వేల నగదు, ఇతర నిత్యావసరాలను ఎస్సై నరేశ్ చేతుల మీదుగా అందజేశారు. ఎస్సైతో పాటు శ్రీశివరామ సాయి యూత్ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్, యువకులు సందీప్, తిరుపతి, మల్లేష్, మధుకర్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

విచ్చలవిడిగా మద్యం కల్తీ!

మార్చి 23న ఎక్సైజ్ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు కాగజ్‌నగర్ పెట్రోల్ పంపు ఏరియాలోని ఓ లెసెన్స్‌డ్ మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. 15 కల్తీ మద్యం క్వార్టరు(180 ఎంఎల్) సీసాలు లభ్యమయ్యాయి. అధికారులు వైన్‌షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. ఇక్కడి నుంచి కల్తీ మద్యం సీసాలను బెల్ట్ షాపులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఏప్రిల్ 29న ఆబ్కారీ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు బెజ్జూర్‌లోని లైసెన్స్‌డ్ మద్యం దుకాణంలో అధిక ధరలకు విక్రయిస్తుండగా కేసు నమోదు చేసి షాప్ సీజ్ చేశారు. చింతలమానెపల్లి మండలం గూడెం లైసెన్స్‌డ్ మద్యం దుకాణంలోనూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ కాగజ్‌నగర్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మార్చి 22న వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదు చేశారు. ఏప్రిల్ 26న అదే వైన్స్‌లో ప్రతి సీసాపై రూ.20 నుంచి రూ.30 అధికంగా వసూలు చేస్తున్నట్లు ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

- పార్లమెంట్ ఎన్నికలకు ముందు జోరుగా దందా
- రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు వాహనాల్లో తరలింపు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ



కౌటాల(సిర్పూర్): పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు భారీగా ఖర్చు చేస్తున్నారు. విజయం కోసం అన్ని దారులు వెతుకుతున్నారు. ఈ తరుణంలో మద్యం ఏరులై పారుతోంది. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వైన్స్‌ల యజమానులు కొత్త దందాలకు తెరలేపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం కల్తీ చేసి నేరుగా విక్రయిస్తున్నారని తెలుస్తుంది.

ప్రత్యేకంగా గ్యాంగ్‌లు.. అంతా సిండికేట్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మద్యం కిక్కు ఎక్కువగా ఉంది. కొన్ని వైన్స్‌లు సీసా సీల్‌కు ఇబ్బంది లేకుండా మూత తీసి కల్తీ చేసేందుకు ప్రత్యేకంగా గ్యాంగ్‌లను నియమించుకున్నాయి. ఈ దందా అంతా రాత్రివేళల్లో జరిగే అవకాశం ఉండడంతో వారికి రోజుకు రూ.వేలల్లోనే చెల్లిస్తున్నారనే సమాచారం. ఖరీదైన బ్రాండ్లకు సంబంధించిన బాటిళ్లలో నాసిరకం మద్యం, నీళ్లు కలుపుతున్నారు. బాటిళ్ల సీళ్ల పగలకుండా చాకచక్యంగా మూత తెరిచి మద్యం బయటకు తీస్తున్నారు. ఇలా ఒకే బాటిల్ మందును రెండు బాటిళ్లలో నింపి విక్రయించి లాభాలు గడిస్తున్నారు. ఓ వైపు కల్తీ దందా సాగుతుండగా.. మరోవైపు సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. సిండికేట్ నిర్ణయించిన ప్రకారం రేట్లు పెంచి అక్రమాలకు పాల్పడుతున్నాయి. మద్యం సిండికేట్‌ను అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా అధికారుల తీరుతో విసిగిపోయిన చాలా మంది నేరుగా రాష్ట్ర టాస్క్‌ఫోర్స్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు మద్యం దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు పెంచారు.

మహారాష్ట్ర ఎన్నికలకు ఇక్కడి నుంచే..!

జిల్లాలో 32 మద్యం లైసెన్స్‌డ్ దుకాణాలు ఉన్నాయి. మహారాష్ట్రకు సరిహద్దున ఉన్న కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో వైన్స్‌లకు డిమాండ్ ఉంటుంది. ఇక్కడి నుంచి సమీపంలో వార్ధా, గడ్చిరోలి జిల్లాలకు తరలించి విక్రయిస్తే అధికంగా లాభాలు వస్తాయి. వేలంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారి నుంచి వ్యాపారులు, దళారులు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు గుడ్‌విల్‌గా చెల్లించి ఆ వైన్స్‌లను నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 19న మహారాష్ట్రలో జరిగిన ఎంపీ ఎన్నికలకు జిల్లాలోని సరిహద్దు మండలాల నుంచే భారీగా మద్యం తరలించినట్లు సమాచారం. ఈ క్రమంలో వ్యాపారులు భారీగా ఆర్జించినట్లు తెలుస్తోంది. ఈ నెల 6న అర్ధరాత్రి సరిహద్దులోని ఓ మండల కేంద్రంలోని వైన్స్‌కు గోదాం నుంచి మద్యం రాగా.. రాత్రికి రాత్రే 20కి పైగా ప్రైవేట్ వాహనాల్లో అక్రమంగా రవాణా చేసినట్లు సమాచారం. జిల్లాలో జోరుగా కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలి కేవలం కాగజ్‌నగర్ పట్టణంలో వైన్స్‌లో మాత్రమే కల్తీ జరుగుతుందంటూ తనిఖీలు చేసి ఎక్సైజ్‌శాఖ అధికారులు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. మారుమూల మండలాల్లో జరుగుతున్నా దందాలపై మాత్రం దృష్టి సారించడం లేదు. వారంతా 'మాములు'గా వ్యవహరిస్తూ.. చర్యలకు వెనుకాడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ప్రత్యేక నిఘా



మద్యం వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా కల్తీ చేసినా.. అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఇలాంటి వారిపై కేసులు నమోదు చేశాం. నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ షాపు వద్ద లూజ్ సేల్ విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఇటీవలే నేను బాధ్యతలు చేపట్టా. ఎన్నికల సమయంలో మద్యం కల్తీకి అవకాశం ఉండడంతో సిబ్బంది క్షేత్రస్థాయిలో నిఘా పెంచారు. ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తున్నాం.

– వి.రవి, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

పెరిగిన పోలింగ్ కేంద్రాలు

- మండలంలో కొత్తగా ఆరు కేంద్రాలు ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన లోహా పోలింగ్ కేంద్రం

దహెగాం: మండలంలోని పలు గ్రామాల్లో స్థానికంగా పోలింగ్ కేంద్రాలు లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడేవారు. దూర ప్రాంతాలకు వెళ్లి ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాల్సి రావడంతో ఓటు వేసేందుకు ఆసక్తి చూపేవారు కాదు. దీంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యేది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా అధికారులు నూతనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మండలంలో 37 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా మరో ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

43కు చేరిన పోలింగ్ కేంద్రాలు..

మండలంలో ఇదివరకు 37 పోలింగ్ కేంద్రాలు ఉండేవి. లోహా గ్రామస్తులు ఓటు వేయాలంటే 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్జికి వచ్చి ఓటు వేసేవారు. దీంతో ఓటు వేయడానికి దూరభారం ఉందని 'ఓటు వేయడానికి ఆరు కిలో మీటర్లు' శీర్షికన సాక్షిలో గత అసెంబ్లీ ఎన్నిక సమయంలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా మరో 6 పోలింగ్ కేంద్రాలను పెంచారు. నూతనంగా లోహా, చౌక, బొప్పురం, పార్వతిపేట, పీపీరావుకాలనీ, భీమిని మండలం కేస్లాపూర్ పంచాయతీలోని కొత్తగూడలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పెరిగిన ఓటర్లు..

మండలంలో అసెంబ్లీ ఎన్నికల్లో 25,992 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 26,078 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో పురుషులు 13,014 ఉండగా, మహిళా ఓటర్లు 13,064 ఉన్నారు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


ఓటు వేయాలంటే ఆరు కిలోమీటర్లు

- లోహా గ్రామస్తులకు కర్జిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

దహెగాం(సిర్పూర్): అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే దహెగాం మండలం కర్జి పంచాయతీలోని లోహా గ్రామానికి చెందిన ఓటర్లు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిరిజన గ్రామమైన లోహాలో 30 గిరిజన కుటుంబాలు ఉండగా 150 జనాభా ఉంది. సుమారు వంద మంది ఓటర్లు ఉన్నారు. ప్రతీసారి ఎన్నికల సమయంలో గ్రామంలోని ఓటర్లు పంచాయతీ కేంద్రమైన కర్జికి వెళ్లాల్సి వస్తుంది. కాలినడకన ఓటు వేసేందుకు పలువురు నిరాసక్తి చూపుతుండటంతో ఓటింగ్‌శాతంపై ప్రభావం పడుతుంది. ఎన్నికల సమయంలో ఆయా పార్టీలు వాహనాలు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.

లోహా గ్రామం

ఎన్నికల అధికారులే దూర ప్రాంతాల్లోని ఓ... కోసం వాహన సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'సాక్షి'లో వచ్చిన కథనం

'మోడీని మించిన నాయకుడు లేడు'



కెరమెరి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్



ప్రచారంలో పాల్గొన్న చీకోటి ప్రవీణ్, హరీశ్‌బాబు

కెరమెరి: దేశంలో మోడీని మించిన నాయకుడు లేడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశానికి దిక్సూచిగా నిలుస్తున్నారన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టిలోకి ఆహ్వానించారు. నాయకులు సొల్లు లక్ష్మి, సతీశ్, విజయ్‌కుమార్, వెంకట్, వేణు, ఉత్తం నాయక్, శ్రీకాంత్, నాగ్‌నాథ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

ధర్మం కోసం బీజేపీని గెలిపించాలి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: దేశం కోసం ధర్మం కోసం పని చేస్తున్న బీజేపీని ఎన్నికల్లో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నేత చీకోటి ప్రవీణ్ అన్నారు. శుక్రవారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మన ఓటు మన దేశం కోసం –ధర్మం కోసం బహిరంగ సభ నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామంలో శుక్రవారం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నగేశ్‌కు ఓటు వేయాలని కోరుతూ మండల నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, ఎంపీటీసీ దూగుంట రాజన్న, నగేశ్, మహేశ్, ప్రభాకర్, మొగిలి భీమయ్య, మండిగ శేఖర్ పాల్గొన్నారు.



కౌటాల: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కౌటాల: బీజేపీతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కోయగూడ గ్రామంలో ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గోడం నగేశ్ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్, భీమయ్య, చందు, మధుకర్, అశోక్, బాబురావు, సంతోష్, నగేశ్, దివాకర్, బండు, శంకర్ పాల్గొన్నారు.


'ఆత్రం సక్కుతోనే పల్లెల అభివృద్ధి'



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కెరమెరి: ఆత్రం సక్కుతోనే పల్లెల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని జోడేఘాట్, బాబేఝరి గ్రామ పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఎంతో చేసిందన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు కుమురం పెందోర్ ఆనంద్‌రావు, భీంరావు, సోనిబాయి, మడావి రఘునాథ్, బొజ్జిరావు తదితరులు ఉన్నారు.

కేంద్ర రక్షణ బలగాలతో కవాతు



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: అర్హులైన ప్రతీ ఒక్కరు ఎంపీ ఎన్నికల్లో విధిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు అన్నారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో కేంద్ర రక్షణ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ నుంచి లారీ చౌరస్తా, రాజీవ్‌గాంధీ, అంబేద్కర్ చౌక్, రైల్వే స్టేషన్ మీదుగా సర్‌సిల్క్ కాలనీలోని పోలీస్‌స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, ఎస్‌హెచ్‌వో శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఐక్యంగా పని చేయాలి



జీఎంను సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పని చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ నాగేశ్వర్ రావు, లైజన్ అధికారి రెడ్డిమల్ల తిరుపతిలు అన్నారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జీఎంను కోరారు. ఏరియాలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం యాక్టింగ్ చేస్తున్న కార్మికులకు ప్రమోషన్లు కల్పించాలని, గోలేటి ఓసీపీని త్వరగా ప్రారంభించి భూనిర్వాసితులకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సింగరేణి యాజమాన్యం గత సంవత్సరం వార్షిక లక్ష్యాన్ని సాధించినందున కార్మికులకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అనంతరం జీఎంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు పత్తెం రాజాబాబు, అనిల్‌కుమార్, సంజీవ్, రవీందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య చెత్తాచెదారం



టీఆర్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం



రాజంపేటలో చెత్త

జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాజంపేట, టీఆర్‌నగర్‌లో నెలల తరబడి చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో ఆయా కాలనీలవాసుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించి చెత్తాచెదారాన్ని తొలగించాలని జిల్లాకేంద్రం వాసులు కోరుతున్నారు.

– ఆసిఫాబాద్‌అర్బన్

వైద్యుల నియామకానికి చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

జైనూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా వైద్యులను నియమించేందుకు చర్యలు చేపడుతున్నామని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జైనూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ తిరుపతి తదితరులు ఉన్నారు.

ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి



సిర్పూర్ (టి): ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు



పెంచికల్‌పేట్‌లో..

సిర్పూర్(టి): ఎంపీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని కాంగ్రెస్‌కు చెందిన ముస్లిం నాయకులు స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని యెమిని మజీద్ ముందర కాంగ్రెస్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ రాష్ట్ర నాయకుడు అబ్దుల్ షకీల్, నాయకులు ఇఫాత్ హుస్సేన్, ముఖీద్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటుతో బీజేపీకి బుద్ధి చెప్పాలి'

పెంచికల్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బీజేపీకి బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. పెంచికల్‌పేట్, చేడ్వాయి గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ కంపెనీలను ప్రైవేటీకరణ చేసి కార్మికులను మోసం చేసిందన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తుందన్నారు. నాయకులు వెంకటి, శ్రీనివాస్, గణపతి, చిరంజీవి, దివాకర్, శంకర్, నారాయణ తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్‌తోనే పేద ప్రజల అభివృద్ధి'

కౌటాల: కాంగ్రెస్‌తోనే దేశంలోని పేద ప్రజల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండలంలోని యాపలగూడ, శీర్షా, సదాశివపేట గ్రామాల్లోని బీఎస్పీ, బీజేపీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు వేస్తే ఉపయోగం లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రాణహిత ప్రాజెక్టుకు నిధులు వస్తాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దేవయ్య, సంతోష్, శ్రీనివాస్, జనార్దన్, లహాను, పాపయ్య, గట్టయ, లక్ష్మణ్, వెంకటి, శ్రీరాములు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో బీజేపీ బంధిఖాన నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం పుస్తకావిష్కరణ కార్యకరమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసి బడాబాబులకు దేశ సంపద దోచిపెడుతున్న బీజేపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణ, సాయి, సుధాకర్, నితీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కొనసాగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి

రెబ్బెన: దేశంలో రిజర్వేషన్లు కొనసాగాలంటే ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకులు ప్రకాశ్‌రావు అన్నారు. శుక్రవారం గోలేటిలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు చేయి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. నాయకులు ఎర్రం తిరుపతి, బలరాం నాయక్, సదాశివ్, సాంబగౌడ్, బండి శ్యాం, వామన్, అడప విమల తదితరులు పాల్గొన్నారు.



రెబ్బెన: ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన వారితో రావి శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలైన ఘటన శుక్రవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి–363పై చిక్లీ వాగు బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కెరమెరి మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వాంకిడి మండలంలోరి ఖైరిట్ గ్రామంలో శుభకార్యానికి హాజరయ్యారు. మండల కేంద్రం నుంచి ఒకే ద్విచక్ర వాహనంపై తిరిగి ఖైరిట్ గ్రామానికి వెళ్తున్న క్రమంలో మహారాష్ట్ర వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో గాయాలపాలైన ముగ్గురిని ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్తుండటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కాగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై సాగర్ పేర్కొన్నారు.